# చెప్పుల దానం

వినాయకుడి పెళ్ళికి వెయ్యినొక్క విఘ్నాలు - అన్న చందంగా ఉంది. వెంకట్రామయ్య చెప్పులు కొనుక్కోవటం.

రిటైరు కాకమునుపే చెప్పుల జతబాగా అరిగిపోయి, పాతబడి, కాళ్ళకు బాధ, నడకకు స్వల్పంగా అంతరాయం కలిగించినా, 'ఇప్పుడు మనం చేయబోయే రాచకార్యా లేమున్నైలే' అని సరిపుచ్చుకొని ఆ యజ్ఞాన్ని వాయిదా వేసుకొన్నాడు. పావలా, అర్థరూపాయి, రూపాయి ఇచ్చుకొంటూ పది పన్నెండుసార్లు రిపేర్లు చేయించినా, పాత చెప్పుల్ని కొత్తవి చేయటం సాధ్యం కాదు కదా !

ఉద్యోగం విరమించిన మూడు నెలలకు గాని రావలసిన ఫండూ, గ్రాట్యుయిటీ చేతి కందలేదు. అందిన వెంటనే చిన్న కూతురి పెళ్ళి. ఇప్పుడు - హళ్ళికి హళ్ళి సున్నకు సున్నా - అన్నట్లుగా కేవలం నెలసరి

పింఛను డబ్బులు తప్పితే చేతిలో వేరే చిల్లిగవ్వ ఉండటంలేదు.

*　　　*　　　*

"ఇదేమిటి?" అన్నది వెంకట్రామయ్య భార్య. పింఛను డబ్బులు లెక్కబెడుతూ.

"చెప్పులు కొనుక్కోవాలి" అని నిర్లిప్తంగా సమాధానం చెప్పాడు.

"మీకూ ఈ నెలే తీరిందీ? ఇంత మతిమరుపైతే చస్తానా? రేపో ఎల్లుండో అల్లుడూ, రాజ్యం పండక్కి వస్తారు కదా?"

వెంకట్రామయ్య మారుమాట్లాడకుండా బిగబట్టిన ఏభై రూపాయలూ భార్య చేతి కందించాడు.

ఆ సాయంత్రం చెప్పులు వేసుకోకుండానే పార్కుకు వెళ్ళాడు. అలవాటు లేని ఔపోసన. కొంచెం ఆలస్యమైంది. తోటి పెన్షన్‌దార్ల సభ ముగించబోతున్నారు. తనతో బాగా చనువుగల నాగభూషణం జోకులు వేస్తూ - "అయినా మన వెంకట్రాముడికి ఈ మధ్య బాగా కాపీనం ఎక్కువవుతూన్నదిలే. కొడుకులూ, కోడళ్ళూ సంపాదిస్తున్నారు. ఒక బాటా జత కొనుక్కుంటే ముల్లె తరిగిపోతుందా?" అన్నాడు.

వెంకట్రామయ్య సమాధానం చెప్పేలోపునే సంభాషణ చెప్పుల క్వాలిటీ కంట్రోలు మీదికి మళ్ళింది. "మనం పల్లెటూళ్ళలో ఉన్న రోజుల్లో తోలు ఆకు చెప్పులు రెండేళ్ళకు తక్కువ సర్వీసు ఇచ్చేవా? కలిగిన రైతు బిడ్డలు కిర్రు చెప్పులు ధరించి అత్తగారిళ్ళకు వచ్చినపుడు - ఆరు నెలలైనా ఆ కొత్త మాసిపోయేదా? ఆ రోజులే వేరయ్యా స్వర్ణయుగం. ఈ మాయదారి కంపెనీ చెప్పు లొచ్చాయి - ఆర్నెల్లకొకటి మార్చాలి."

*　　　*　　　*

ఆపై నెలలో కూడా వెంకట్రామయ్య చెప్పుల బేరం పడలేదు. "ఈ నెల్లో రెండు తద్దినాలు పెట్టాలి. మీకూ ముహూర్తం ఇప్పుడే కుదిరిందా?" అన్నది - భార్య.

ఆ సాయంత్రం పార్కుకు వెడుతూ దారిలో చెప్పుల వాడి దగ్గర ఆగిపోయాడు.

"మరీ మేకులు కొడుతున్నావ్. దారంతో కుట్టలేవా?" అన్నాడు.

"నావల్ల కాదు బాబూ. ఈ అతుకులు దారంతో నిలుస్తాయా?" అంటూనే చెప్పుల వాడు మామూలు కన్నా కొంచెం పెద్ద సైజు మేకులు కొట్టి ఇచ్చాడు.

కొంచెం కుంటుకుంటూనే వెంకట్రామయ్య ఇల్లు చేరాడు. ఇంట్లో కొంచెం హడావిడిగా ఉంది. పెద్ద కొడుకూ, కోడలూ - ఇద్దరూ ఉద్యోగస్తులే. వాళ్ళ ఆఫీసు వాళ్ళందరికీ రాత్రి విందు. వెంకట్రామయ్య వరండాలో తన మంచం ముందు చెప్పులు విడిచి చిన్న మనవరాలిని - "కాసిని దాహం తీసుకురమ్మని బామ్మకు చెప్పు తల్లీ" అన్నాడు.

భార్య మంచినీళ్ళ గ్లాసు అందిస్తూండగానే మనవరాలు మళ్ళీ వచ్చింది.

"తాతయ్యా ! నువ్వు చెప్పులు ఇక్కడ పెట్టకూడదు."

"ఏం తల్లీ?"

భార్య కలుగజేసుకొని - రాత్రికి ఆఫీసర్లూ, వాళ్లూ విందుకొస్తారుట. మీరు డాబా మీద చాప వేసుకు పడుకోండి. వాళ్ళంతా వెళ్ళిందాకా" - అని విడమరచి చెప్పింది.

వెంకట్రామయ్యకు కోపం రాలేదు. కోపం తెచ్చుకొనే వాడైతే ఎప్పుడో ఇల్లు దాటి వెడలిపోయేవాడు. పోయిన వారం మనవరాల్ని షికారు తీసుకెళ్తూండగా వెనకనుంచి, చిన్నకొడుకు అంటూన్న మాటలకూ అతను కలవరపడలేదు - చెప్పు ల్లేకుండా, ఆ పాత పంచె, ఉత్తరీయం వేసుకొని - ఏమిటమ్మా వీథిలో ప్రయాణం? అన్నాళ్ళు ఉద్యోగం చేశాడు. ఒక మామూలు చేతి గడియారం కొనుక్కొంటే ఏం పోయేది?"

భార్య అతనికేం సమాధానం చెప్పిందో, తనైతే వినలేదు గాని,

తను గడియారం ఎందుకు కొనుక్కోలేదో, పాత పంచెలే ఎందుకు ధరిస్తున్నాడో వీళ్ళకు చెప్పటం చాలా అప్రస్తుతం అనుకొన్నాడు. అప్పటికి గడిచిన కాలం గురించి వెంకట్రామయ్య ఎక్కువగా ఆలోచించే వ్యక్తి. కాదు.

* * *

విందు అయిపోయి అతిథులు నిర్గమించిన తరువాత కూడా వెంకట్రామయ్య డాబా దిగి రాలేదు. భార్య మెల్లెక్కి తట్టి లేపింది. అతని ఒళ్ళు వేడిగా ఉంది - "ఆరుబయట ఇంతసేపు బుద్ధిగల వాళ్ళెవరూ పడుకోరు. లెండి లెండి" అని కిందకు నడిపించుకుపోయింది.

మర్నాడు కూడా వెంకట్రామయ్య జ్వరం తగ్గలేదు. ఆఫీసు కెడుతూ కొడుకు- ఏమిటమ్మా నాన్నగారింకా లేవలేదు? ఇంటి కెవరన్నా వస్తే వరండా అంతా అసహ్యంగా ఉంటుంది. లేపి స్నానం చేయమను" అని తల్లిమీద విసుక్కున్నాడు.

వెంకట్రామయ్య మాత్రం స్నానం చేయలేకపోయాడు. ముఖం, మెడ చన్నీళ్ళతో కడుక్కొని మళ్ళీ వచ్చి మంచంమీద వాలిపోయాడు.

* * *

మూడు రోజులు వరుసగా వెంకట్రామయ్య పార్కులో హాజరు కాకపోయేసరికి నాగభూషణం, గజపతినాయుడు, రామశర్మ - నేరుగా ఇంటికే వచ్చారు.

అప్పటి కతని ఒంటిమీద స్పృహలేదు, కుడికాలు ఎర్రగా వాచి ఉన్నది. పెద్ద కొడుకు, చిన్న కొడుకు తండ్రిని ఆస్పత్రికి తీసుకుపోయే ప్రయత్నంలో ఉన్నారు. వాళ్ళ స్నేహితుడు - ఓ కుర్రడాక్టరు వచ్చి చూసి "ధనుర్వాతం అని తోస్తున్నది. హాస్పిటలైజు చేయాల్సి ఉంటుంది" అని చెప్పాడు.

వెంకట్రామయ్య భార్య ఖిన్నురాలై, తలుపు మాటున నుంచొని భర్త స్నేహితుల మాటలు వింటున్నది.

ఏమైతేనేం - వెంకట్రామయ్యను ప్రప్రథమ భారత రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ స్మారక వార్డులో చేర్పించారు. సివిల్ సర్జన్ - వెంకట వామన హనుమత్ ప్రసాద్‌గారు, ఆ ఉదయం తన ప్రైవేటు ప్రాక్టీసు కేసులన్నీ చూసుకొని వార్డుకు ఆలస్యంగా చేరుకొన్నారు. చేరుకొని, తన ప్రైవేటు కేసుల మంచాలన్నీ చూసుకొన్నాడు. ఆ సాయంత్రం విమానంలో ఆయనకు ప్రయాణం ఉంది. బొంబాయిలో అంతర్జాతీయ సర్జన్ల సెమినార్ ఉన్నదాయెను. కొత్త కేసు వెంకట్రామయ్య కేస్ షీట్ చదివే ఓపికలేక అసిస్టెంటు సర్జన్స్‌తో నాలుగు ముక్కలు చెప్పి కారు అధిష్టించాడు.

అసిస్టెంటు సర్జన్స్ అప్పారావు, రఘునందన్‌రావు మొన్న జరిగిన రిజర్వేషన్ - యాంటీ రిజర్వేషన్ అలజడిలో చెరొక పక్షానికి చెందినవాళ్ళు. రఘునందన్ కొద్ది నెలల క్రితమే ఢిల్లీ ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణ పొంది వచ్చినవాడు - "గాంగ్రేన్. ఫర్ ఇమ్మీడియేట్ యాంప్యూటేషన్ ఆఫ్ రైట్‌లెగ్" - అని కేస్ షీట్‌లో రాసి, హెడ్ నర్సుతో ఆపరేషన్ థియేటర్‌కు కబురు చెయ్యమని ఆదేశించి, లంచ్ బ్రేక్‌కు వెళ్ళిపోయాడు. సీనియర్ - అప్పారావు - అది చూసి మండిపోయాడు. "బయాప్సీ - పాథాలజిస్ట్ టు రిపోర్ట్" అని నర్సుకు ప్రత్యేకించి చూపి రాసినదాన్ని అర్థం చేసుకోమని తన గదిలోకి నిష్క్రమించాడు.

పాథాలజీ డిపార్ట్‌మెంటులో ఆ రోజు వార్డుబాయిల సమ్మె. మరునాటి సాయంకాలానికిగాని రిపోర్టు రాలేదు. "గాంగ్రెన్ - విష పూరితమైనది" అని రిపోర్టులో నిర్ధారణ అయింది.

* * *

మరునాడే వెంకట్రామయ్య కాలు నరికేస్తారు. టెలిగ్రాం అందు కొని పెద్ద కూతురు నేరుగా ఆస్పత్రికే వచ్చింది.

పెద్ద కొడుకు - డాక్టర్ రఘునందన్‌ను బ్రతిమాలుకొన్నాడు. "ఎంత ఖర్చయినా సరే, మా నాన్నని బ్రతికించండి" అంటూ.

"ఎంత ఖర్చూకాదు - బాబూ. ఆపాత మేకుల చెప్పులు వద్దని మీరైనా ముసలాయనకు చెప్పి ఉండాల్సింది" అని నర్సును హడావిడి చేశాడు - డాక్టర్.

విచిత్రంగా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకుపోబోయేముందు వెంకట్రామయ్యకు పూర్తిగా తెలివి వచ్చింది. పెద్ద కూతుర్ని పిలిపించు కొన్నాడు. ఆమెమీద అతనికి ఎంతో ప్రేమ. చేతులు నిమిరి "చెవి దగ్గరికి పెట్టు తల్లీ" అని కోరాడు.

"మీ అమ్మ పల్లెటూరి పిల్ల. కొత్త కాపురం పెట్టిన రోజున మొదటకొన్న వస్తువేదో తెలుసా - తల్లీ...? చెప్పులు. ఎంత మురిసి పోయిందో!"

వెంకట్రామయ్యకు వెంటనే మగత వచ్చేసింది. ఏమీ అర్ధంకాక భోరున విలపిస్తూన్న పెద్ద బిడ్డ ముఖం అతను చూడనేలేదు.

మరో గంటలో అతని కాలు తీసేశారు. ఆ తర్వాత అరగంటలో కాలుకు ఇంకా కుట్లు పడుతూండగానే, వెంకట్రామయ్య ఆపరేషన్ బల్ల మీదనే తన ఇహలోక యాత్ర ముగించి ఎక్కడికో వెళ్ళిపోయాడు

* * *

వెంకట్రామయ్య రక్తబంధువు లందరికీ అర్జెంటు తంతి వార్తలు వెళ్ళాయి. వాటికి సరిగ్గా ఏభై రూపాయలైంది.

ఆస్పత్రి నుంచి ఆయన భౌతికకాయాన్ని ఇంటికి తరలించ టానికి టాక్సీ ఖర్చు కూడా ఏభై రూపాయలే అయింది.

అతని ఖననం ముందు స్నేహితులు ముగ్గురూ వేర్వేరుగా కొన్న పూల మాలల ఖర్చూ ఏభై రూపాయలే.

కర్మలై పోగానే కొడుకులు చేయవలసిన షోడశదానాల్లో చెప్పుల దానం కూడా ఒకటి కదా. చిన్ని కొడుకు తెచ్చిన పాదరక్షల జత పెద్ద కొడుక్కు నచ్చక, మంచివి బాటా కంపెనీవి తెప్పించాడు. వాటి వెల కూడా ఏభై రూపాయలే.

బ్రాహ్మడికి చెప్పుల దానం చేస్తూండగా వెంకట్రామయ్య మనవరాలు చూసింది - "నాన్నా తాతయ్యకు ఒకకాలే గదా మిగిలింది. మీరు రెండు చెప్పు లిస్తున్నారెందుకు?" అని తండ్రిని ప్రశ్నించింది. బహుశా ఆ ప్రశ్న విలువ కూడా అంతేనేమో.

వెంకట్రామయ్య పోయి చాలా సంవత్సరాలై ఉండవచ్చు. ఏటా అతని తద్దినాలు పెడుతూనే ఉన్నారు. అతని భార్య - కొడుకులు మరిచిపోయినా, చెప్పుల దానం ఇప్పిస్తూనే ఉంది. ○

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,
9-11-1988